01ATP05F_01ATP05F.qxd 05-11-2025 PM 11:14 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 06 నవంబర్ 2025 పేజీలు : 04

కళ్యాణదుర్గం వస్తున్న రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్

కళ్యాణదుర్గం, నవంబర్ 5 ప్రభాతవార్త:

రాష్ట్ర ఐటీ, హైఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్‌టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ నవంబర్ 7వ తేదీన అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పర్యటనకు రానున్నారు. ఈ మేరకు అధికారిక టూర్ ప్రోగ్రామ్ విడుదలైంది.

వివరాల ప్రకారం మంత్రి నారా లోకేష్ ఉదయం 10.30 గంటలకు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి నివాసం నుంచి బయలుదేరి, 10.45 గంటలకు అమరావతి సచివాలయంలోని బిల్డింగ్ నం.1కి చేరుకుంటారు. అక్కడ ఉదయం 10.45 నుండి మధ్యాహ్నం 12.30 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

తరువాత 12.30 గంటలకు సచివాలయం నుంచి బయలుదేరి, 1.20 గంటలకు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుంటారు. 1.30 గంటలకు విమానమార్గంలో విజయవాడ నుంచి బయలుదేరి, 2.15 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 2.30 గంటలకు పుట్టపర్తి నుంచి బయలుదేరి, 4.30 గంటలకు కళ్యాణదుర్గం టీడీపీ కార్యాలయానికి చేరుకుంటారు. సాయంత్రం 4.30 గంటల నుంచి 7.30 గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రాత్రి కళ్యాణదుర్గం టీడీపీ కార్యాలయంలోనే బస చేయనున్నారు. నారా లోకేష్ జడ్ కేటగిరీ భద్రతా వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన పర్యటన సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

పల్లె పల్లెలో...సాయి నామస్మరణ..!!

- భజన ఉంటే విభజన ఉండదు...ఇదే సత్యసాయి తత్వం..!!
- అర్‌జె రత్నాకర్ చేతుల మీదుగా శ్రీసత్యసాయి సేవాసదనం ప్రారంభం
- సత్యసాయి శతజయంతి ఉత్సవాలకు...150 దేశాల నుంచి భక్తులు వస్తున్నారు
- జిల్లాలోనే ప్రథమంగా గోరంట్ల సత్యసాయి భజన మండలి భవన నిర్మాణం
- జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, వెంకటశివారెడ్డి దంపతుల సహకారంతో నిర్మాణం పూర్తి
- వందలాది మంది పేదలకు రత్నాకర్ చేతుల మీదుగా దుస్తులు పంపిణీ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జె రత్నాకర్

గోరంట్ల, నవంబర్ 5 ప్రభాతవార్త

ఎక్కడైతే భజన ఉంటుందో అక్కడ విభజన ఉండదని భగవంతుని నామస్మరణం మనశ్శాంతికి ఐకమత్యానికి నిలయంగా మారుతుందని శ్రీసత్యసాయి నామస్మరణతో ఆత్మశాంతి లభిస్తుందని ప్రతి ఒక్కరూ మనసు ప్రశాంతంగా ఉండేలా భగవంతుని నామస్మరణ చేసుకోవాలని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ డైరెక్టర్, శ్రీసత్యసాయి బాబా వారసులు ఆర్‌జె రత్నాకర్ అభిప్రాయపడ్డారు. గోరంట్ల పట్టణంలో జిల్లాలో ఎక్కడలేని విధంగా అతి సుందరంగా ప్రశాంత వాతావరణం మధ్య అన్ని రంగులతో శ్రీసత్యసాయి సేవాసదనం భవనాన్ని నిర్మించి ప్రారంభించడం అభినందనీయమని భవన నిర్మాణానికి కారకులైన సత్యసాయి భక్తులు, శ్రీసత్యసాయి భజన మండలి జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, వెంకటశివారెడ్డి దంపతులను ఆర్‌జె రత్నాకర్ అభినందించారు. గోరంట్ల మండల కేంద్రంలో బుధవారం సత్యసాయి సేవా సదన్ భవన ప్రారంభోత్సవానికి ఆర్‌జె రత్నాకర్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారి వద్ద నుంచి కార్యక్రమ నిర్వాహకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌జె రత్నాకర్‌ను మంగళవాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. అనంతరం భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రత్నాకర్

ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భవనంలోని సాయి భజన సమావేశ హాల్‌లో జ్యోతి ప్రజ్వలన, సత్యసాయి చిత్రపటానికి మంగళహారతి వంటి కార్యక్రమాల్లో రత్నాకర్ పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్‌జె రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 150 దేశాల్లో శ్రీసత్యసాయి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సత్యసాయి శతజయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాలకు అనేక దేశాల నుంచి లక్షలాది మంది జనంఅనేక దేశాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తున్నారని తెలిపారు. సత్యసాయి జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో మొట్టమొదటిసారిగా అతి సుందరంగా సత్యసాయి సేవాసదన్ భవనం నిర్మించడం శుభ పరిణామమని సాయి నామస్మరణతో మనసు ప్రశాంతంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గోరంట్ల సిఐ బోయ శేఖర్, ఎస్ఐ రాము తమ సిబ్బందితో గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సత్యసాయి భక్తులు, భజన మండలి సభ్యులు, సేవాదళ్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

బిటిపి ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేసి

చెరువులకు నీరిస్తాం

- వేగంగా బిటిపి పనులు జరుగుతున్నాయి- కళ్యాణదుర్గం నియోజకవర్గానికి 24పిఎంజిఎస్‌వై రోడ్లు మంజూరు

- మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు - పరిశ్రమలను అభివృద్ధి చేస్తున్నాం - కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వెల్లడి



అమిలినేని సురేంద్రబాబు

అనంతపురం, నవంబర్ 5 ప్రభాతవార్త బ్యూరో

జిల్లాలో వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అందులో భాగంగా బిటిపి ప్రాజెక్టు పూర్తి అయితే నియోజకవర్గంలో సాగునీటి సౌకర్యాలు మెరుగు అవుతాయని రెండేళ్లలో బిటిపి ప్రాజెక్టును పూర్తి చేసి చెరువులకు కూడా నీరు ఇస్తామని కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. రహదారులు, స్కూళ్ల అభ్యున్నతికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాని, రఘువీరారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు క ళ్యాణదుర్గంలో రింగు రోడ్డు మాత్రమే వేశారని, నియోజకవర్గంలోని అన్ని రోడ్లు అభివృద్ధి చేసేందుకు నేను చర్యలు తీసుకుంటున్నానని ఆయన వెల్లడించారు. ప్రభాతవార్త ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కళ్యాణదుర్గం అభివృద్ధికి తాను తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు. బిటిపి ప్రాజెక్టు అనేది కళ్యాణదుర్గం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక. ఎ న్నికల సమయంలో నాతోపాటు మంత్రి నారాలోకేష్ తదితరులు హామీలు ఇచ్చామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బిటిపి ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. కూటమి ప్రభుత్వం బిటిపి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుతం బిటిపి ప్రాజెక్టు పనులు శర వేగంగా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. భూ సేకరణ సమస్య పెండింగ్‌లో ఉండటం వల్ల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 14, 16 నెలలు ఆలస్యమైందని ఇందుకు సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాబోయే రెండేళ్లలో బిటిపి ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. బిటిపి ప్రాజెక్టుకు సంబంధించి చాలా స్ట్రక్చర్లు, పంపింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు దాదాపు రెండేళ్ల సమయం పడుతుందని ఆయన తెలిపారు. 342 కోట్లతో ఎస్ఆర్‌సి బిటిపి కింద సివిల్ పనులను దాదాపు 150 కోట్లతో బిఎస్ఆర్ సంస్థ మెకానికల్ పనులను చేస్తోందన్నారు. సివిల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇందుకు సంబంధించి కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు.

పిఎం జిఎస్‌వై కింద 24 రోడ్లు మంజూరు

అనంతపురం జిల్లాలో పిఎస్ఓ కింద 39 రోడ్లు మంజూరు అయితే ఒక్క కళ్యాణదుర్గం నియోజకవర్గానికే రూ.100 కోట్లతో 24 రోడ్లు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే సురేంద్రబాబు వెల్లడించారు. రోడ్ల అభ్యున్నతికి ఎక్కువ దృష్టి పెట్టినట్లు ఆయన వెల్లడించారు. రఘువీరారెడ్డికళ్యాణదుర్గం శాసన సభ్యునిగా ఉన్నప్పుడు చుట్టూ రింగు రోడ్లు మాత్రమే వేశాడని, నియోజకవర్గంలో రోడ్లు గురించి పట్టించుకోలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి 24 రోడ్లను కొత్తగా నిర్మించేందుకు పిఎం జిఎస్‌వై కింద మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. అదే సమయంలో స్కూళ్ల అభివృద్ధిని కూడా దశల వారీగా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. కళ్యాణదుర్గం రూరల్ మండలం పాలవాయి స్కూల్‌లో దాదాపు 70 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని, బాస్కెట్‌బాల్ కోర్టు, టాయిలెట్లు, ఇతర పనులు చేసినట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. కళ్యాణదుర్గం మండలం తిమ్మసముద్రం వద్ద పరిశ్రమల కోసం 1000 ఎకరాలను ఏపిఐఐసికి అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈ కింద 300 ఎకరాలను 4 కోట్ల సివిల్ పనులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కళ్యాణదుర్గానికి రెండు డిఫెన్స్ కంపెనీలు వచ్చాయన్నారు. 150 ఎకరాల్లో ఎయిర్ స్ట్రిప్ పరిశ్రమ వస్తోందన్నారు.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు :

ఎన్.రఘువీరారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కళ్యాణదుర్గం పంచాయితీ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయిందని, ఆ తర్వాత ఎ వరు కళ్యాణదుర్గం మున్సిపాలిటీకి చర్యలు తీసుకోలేదన్నారు. 2014, 2019, 2024లలో గెలిచిన వారు ఎవరు కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎవరు చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యేగా తాను గెలిచిన తర్వాత కళ్యాణదుర్గం మున్సిపాలిటీపైన కూడా దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. రోడ్లు వెలడల్పు చేయాలని గతంలో ఎమ్మెల్యేలు నచ్చిన వారి ఇల్లు కొట్టకుండా నచ్చని వారి భవనాలను కొంత భాగం తొలగించారని, అవి కూడా అసంతృప్తిగా నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు. అందులో భాగంగా వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నామని అందులో భాగంగా 10 అడుగల హంస విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. వాల్మీకి సర్కిల్‌లో 80 లక్షల ఖర్చుతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందులో భాగంగా ఆర్ అండ్ బి సర్కిల్‌లో ఆక్రమణలను తొలగించి రోడ్ల విస్తరణకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నామని ముగ్గురు, నలుగురు కోర్టుకు వెళ్లి రోడ్డు విస్తరణ పనులు అడ్డుకోవాలని చూశారన్నారు. హై కోర్టు కూడా విచారణ చేసి ఆర్ అండ్‌బి పరిధిలో ఆక్రమణలు తొలగించాలని, ప్రైవేట్ స్థలాల్లో ఉంటే నష్టపరిహారం కట్టించాలని తీర్పు ఇచ్చినట్లు ఆయన వివరించారు. కోర్టుకు వెళ్లిన వారు ఆర్ అండ్ బి స్థలాల్లో ఉన్నందున త్వరలో వాటిని తొలగిస్తామని ఆయన తెలిపారు. 7, 8 తేదీల్లో మంత్రి నారాలోకేష్ వస్తున్నందున మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు పాల్గొంటారని ఆయన వివరించారు.

వివాదాస్పద మైనింగ్ లీజుల్లో సరిహద్దుల సర్వే

ఏజీకే మైనింగ్ లో లైడర్ సర్వేను నిర్వహిస్తున్న సర్వే బృందం

ఐదు మైనింగ్ లీజుల్లో సరిహద్దు పిల్లర్లను గుర్తిస్తున్న సర్వే బృందం

డి.హిరెహాళ్ నవంబరు 5 ప్రభాతవార్త

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ఇరు రాష్ట్రాలకు చెందిన ఇనుపు గనుల లీజుల పరిధిలోని వివాదాస్పదమైన అంతర్ రాష్ట్ర సరిహద్దుల సర్వే కొనసాగుతోంది. బుధవారం అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలంలోని గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓఎంసీ, ఏఎంసి, ఏజీకే మైనింగ్ లీజులతో పాటు మహాబలేశ్వరప్పకు చెందిన వైఎం, ఎస్.కె. మోదీ కి చెందిన బిఐఓపి మైనింగ్ లీజుల్లో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్ డిడిలు జయ రాజ్, హరికృష్ణ ఆధ్వర్యంలో గనులు భూగర్భ శాఖ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా ఈ సర్వే చేపట్టారు. మండల పరిధిలోని మలపనగుడి సర్వే నంబర్ వన్‌లోని గాలి జనార్దన్ రెడ్డికి చెందిన అంతరగంగమ్మ మైనింగ్ లో 68.5 హెక్టార్లలో డోన్ సర్వేతోపాటు, లైడర్ సర్వే చేపట్టి 11 లీజు హద్దురాళ్ళను గుర్తించి సర్వే పూర్తి చేసినట్లు సర్వే బృందం అధి కారులు పేర్కొన్నారు. ఓబులాపురం సర్వే నంబర్ వన్ లో గాలి జనార్దన్ రెడ్డికి చెందిన మైనింగ్ లీజులు ఓఎంసీ 1, ఓఎంసీ 2, ఏఎంసీ, హెచ్.సిద్దాపురం సర్వే నంబర్ వన్‌లో వై.మహాబలేశ్వర కు చెందిన వైఎం, ఎస్.కె.మోదీ కి చెందిన బిఐఓపి మైనింగ్ లీజుల్లో సరిహద్దు రాళ్లను గుర్తించే ప్రక్రియను సర్వే బృందం వేగవంతం చేశారు. వివాదా స్పదంగా మారిన ఈ ఐదు మైనింగ్ లీజుల్లోని 119.25 హెక్టార్లలో మొత్తం 41 సరిహద్దు బౌండరీలను పరిశీలించి గుర్తించేందుకు మూడు శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సరిహద్దుల ఏర్పాటుకు సర్వే బృందం సభ్యులు ఏడు బృందాలుగా విడిపోయి ఆయా మైనింగ్ లైజుల పరిధిలో సరిహద్దుల బౌండరీలను గుర్తిస్తున్నారు. మూడు శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వే మరో నాలుగు రోజుల్లో ముగించి డ్రోన్, లైడర్ సాంకేతిక పరికరాలతో ఈ వివాదాస్పద మైనింగ్ లేదు సర్వే పూర్తి చేసి సరిహద్దు రాళ్లు ఏర్పాటుచేసి వివాదానికి తెరదించాలన్న సంకల్పంతో సర్వే బృందం సర్వేను వేగవంతంగా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డు ఏడి రూప్లానాయక్, మండల సర్వేయర్ రవితేజ, మైనింగ్ ఏజి పెద్దరెడ్డి బృందం, అటవీశాఖ ఆర్ఎఫ్ఓ రామచంద్రుడు, డిఆర్ఓ దామోదర్ రెడ్డి బృందం, వీఆర్వోలు బాలాజీనాయక్, వరదరాజులు, వీఆర్ఏలు ఫణి, నాగరాజు, రమేష్, నింగప్ప పాల్గొన్నారు.

ఏజీకే లో సరిహద్దు పిల్లర్ ను పరిశీలిస్తున్న సర్వే బృందం

జిల్లాలో ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకం

లక్ష్యాలు-ప్రయోజనాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి

శ్రీ సత్యజిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్

అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 5, ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లాలో ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజ నపథకం ద్వారా దీర్ఘకాలిక లక్ష్యాలు ప్రయోజనాలపై జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకంపై లక్ష్యాలను నిర్దేశించుకుని దీర్ఘకాలంగా వాటిని అమలుపరచడంపై జిల్లా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడంపై వ్యవసాయ అనుబంధ శాఖలు, ఇరిగేషన్, ఇండస్ట్రీస్, స్కిల్ డెవలప్మెంట్, బ్యాంకింగ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి మరియు ఆహార భద్రత సాధనను లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ధనధాన్య కృష్టి యోజన పథకానికి సంబంధించి జిల్లా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ఇందులో 6 ముఖ్య లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని స్పష్టమైన ప్రణాళిక తయారు చేయాలనీ, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంట వైవిధ్యీకరణ మరియు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం; పంటకోత తర్వాత నిల్వ సామర్థ్యాన్ని పెంచడం; నీటిపారుదల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం; స్వల్పకాలిక మరియు దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు ఎక్కువ ప్ ప్రాముఖ్యతను కల్పించడం, మెరుగైన పాలన సేవా బట్వాడా, అందుబాటులో ఉన్న వనరులను ఉత్తమంగా ఉపయోగించుకుంటూ జిల్లాలో రైతుల ఆదాయం పెంపు అయ్యేలా ప్రణాళిక ఉండాలన్నారు. అలాగే వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతుల విస్తరణ, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు, మార్కెటింగ్‌లో సులభతరం, గ్రామీణ ఉపాధి సృష్టి ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలు అన్నారు. ఇందులో భాగంగా... రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికాలపై శిక్షణ, అధిక దిగుబడి విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, పురుగుమందుల సమగ్ర సరఫరా, నీటి వనరుల వినియోగం, మైక్రో ఇరిగేషన్ ప్రోత్సాహకాలు, వ్యవసాయ యంత్రాల సబ్సిడీ అందజేత, పంటల బీమా మరియు పంట నష్టం పరిహారంలో వేగవంతమైన సేవలు, రైతు ఉత్పత్తులకు మార్కెట్ లింకేజ్, నిల్వ/గోదాం సదుపాయాల విస్తరణ, పంటల ప్రాసెసింగ్ యూనిట్ల ప్రోత్సాహం ద్వారా విలువ వృద్ధి పెంచేలా లక్ష్యంగా పని చేయాలన్నారు. జిల్లాలోని రైతులందరూ ఈ పథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని, వ్యవసాయ రంగం మరింత బలోపేతం కావాలని, ఆ దిశగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రాము నాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, ఏపిఎంఐపి పిడి సుదర్శన్, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, భూగర్భ శాఖ అధికారి రాజశేఖర్, పశుసంవర్ధక అధికారి శుభదాసు, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, సెరికల్చర్ అధికారి శోభారాణి, జిల్లా సహకార అధికారి క్రిష్ణా నాయక్, ఎల్డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి హరికృష్ణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిలో బ్యాంకు మేనేజర్ ఉరి వేసుకుని ఆత్మహత్య

తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోగర్ తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 11 గంటలైనా మేనేజర్ బ్యాంకుకు రాకపోవడంతో తోటి ఉద్యోగులు తన ఇంటి దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ బ్యాంకు మేనేజర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మేనేజర్ గోగర్ గత సంవత్సరం నుండి యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న బ్యాంకు మేనేజర్ గోగర్

అదుపుతప్పి ఆర్టీసి బస్సు బోల్తా 4 >>

ప్రజల కోసం మనమంతా బాధ్యతాయుతంగా పనిచేద్దాం

ఆంజనేయస్వామిని దర్శించుకున్న జిల్లా అదనపు జడ్జి

మురిడి ఆంజనేయ స్వామి సేవలో జిల్లా అదనపు జడ్జి

డి.హిరెహాళ్ నవంబరు 5 ప్రభాతవార్త

కార్తికమాసం పౌర్ణమిని పురస్కరించుకొని ఎస్సీ, ఎస్టీ కేసుల స్పెషల్ జిల్లా అదనపు జడ్జి సాదుబాబు కుటుంబ సమేతంగా ప్రసిద్ధి చెందిన మురడి ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. బుధవారం డి.హిరెహాళ్ మండలం మురడి ఆంజనేయస్వామి దేవాలయంలో మాజీ ధర్మకర్త పెద్దమడి వెంకటరెడ్డి జడ్జి కుటుంబానికి స్వాగతం పలికి ప్రధాన అర్చకులు రామాంజనేయులు, పవన్ కుమార్ ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. జడ్జి కుటుంబ సభ్యులు అర్చకుల చేత స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి సన్నిధిలో ఆలయ మాజీ ధర్మకర్త జడ్జికి ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందించి అర్చకుల చేత సన్మానం చేయించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం రాయదుర్గం మండలం లింగాల బండ పై వెలిసిన పశుపతనాథ స్వామి ఆలయాన్ని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించి మూక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా డి.హిరెహాళ్ ఎస్ ఐ గురుప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వెలుగుసిబ్బందితో కన్వీనర్ పాల బండ్ల శ్రీరాములు సమావేశం

బ్రహ్మ సముద్రం నవంబర్ 5 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్

కళ్యాణదుర్గం శాసన సభ్యులు అమిలినేని సురేంద్ర బాబు ఆదేశాలమేరకు వెలుగు యానిమేటర్లతో టీడీపీ మండల అధ్యక్షులు పాల బండ్ల శ్రీరాములు బ్రహ్మ సముద్రం మండల కేంద్రంలోని వెలుగుకర్యాలయం నందు వెలుగు సిబ్బంది తోసమావేశం సమావేశం నిర్వహించడం.జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు అధికారులకుతెలియచేస్తూ ఈ నెల 8వ తేదీన కళ్యాణదుర్గం పట్టణంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ చేతుల మీదుగా జరగనున్న శ్రీ భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంను జరుగుతుందనీ కావునమండల లోని యానిమేటర్లు ప్రజలను భారీసంఖ్యలో తరలించి. కార్య క్రమం విజయవంతంచేయాలని తెలియ చేశారు ఈ కార్య క్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు అంకె ఓబులేష్, క్లస్టర్ 2 ఇంచార్జ్ నాగరాజు, క్లస్టర్ వన్ ఇంచార్జ్ వన్నూరు స్వామి ఏపీఎం నారప్ప , సీసీలు మారెప్ప, శ్యామన్న, తిప్పే స్వామి, వెలుగు యానిమేటర్లు,తదితరులు పాల్గొన్నారు.

బుధవారం నుండి పోలేపల్లి గౌరమ్మ జాతర

బ్రహ్మసముద్రం నవంబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని పోలేపల్లి గ్రామంలో ప్రతి సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు నుండి పోలేపల్లి ప్రజల ఆరాధ్య దేవత అయిన గౌరీదేవి గౌరమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తారు ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంకాలం కాశస్థాపన గురువారం పూజా కార్యక్రమం శుక్రవారం రాత్రి ఒంటిగంటకు గౌరీదేవి ఆగమనము శనివారం భక్తులకు దర్శనము అన్న సంతర్పణ ఆదివారం తెల్లవారుజామున నుండి 9 గంటల వరకు ఊరేగింపు అనంతరం గౌరీ దేవిని జలధికి తీసుకెళ్లడం జరుగుతుందని ఆలయ పెద్దలు గ్రామస్తులు తెలియజేశారు

నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయండి.. - దేవినేనిధర్మతేజ

శెట్టూరు, నవంబర్ 05 ప్రభాతవార్త

సమావేశంలో మాట్లాడుతున్న దేవినేని ధర్మతేజ

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ నెల 08న కళ్యాణదుర్గంలో నిర్వహిస్తున్న కనకదాసు జయంతి, విగ్రహావిష్కరణ వేడుకలకు ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విచ్చేస్తున్న సందర్భంగా ప్రతి గ్రామం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చేలాచేసి లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని శెట్టూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాయకులు, కార్యకర్తలతో టీడీపీ నాయకుడు ధర్మతేజ తెలిపారు.. సమావేశంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

కూటమి కుట్ర చేస్తోంది సంతకాలు పెట్టండి

వైద్య కళాశాలను ప్రైవేటు పరం నిరసిస్తూ పులేరు, వెంకటరమణ పల్లి పంచాయతీ కేంద్రాల్లో సంతకాల సేకరణ

గోరంట్ల నవంబర్ 5 ప్రభాతవార్త

సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ హయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వం మంజూరు చేసిందని వేగ వంతంగా నిర్మాణాలు సైతం దాదాపు పూర్తి చేసిందని అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కాలేజీ లను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు చేస్తోందని అందుకు నిరసనగా ప్రజల నుంచి కోటి సంతకాలకు నాంది పలికామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని పోలేరు వెంకటరమణ పల్లి పంచాయతీ కేంద్రాల్లో పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ ఆదేశాల మేరకు పుల్లేరు గ్రామంలో రాణా ప్రతాప్ సింగ్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, సురేష్ రెడ్డి, మిల్ట్రీ బాషా అలాగే వెంకటరమణ పల్లి పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ అశ్వర్థ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, సంపత్ కుమార్, చౌటిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసే కుట్రను మానుకోకపోతే ప్రజల సహకారంతో ప్రభుత్వంపై తిరుగుబాటు తెస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రామిరెడ్డి, కలందర్, బండారి నాగప్ప, కిష్టప్ప, కృష్ణా రెడ్డితదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

చిలమత్తూరు, నవంబర్ 5 ప్రభాతవార్త : చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం ఏసిబి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వివరాలు ఇలా వున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అవినీతి ఫిర్యాదుల్లో భాగంగా ఏసిబి అధికారులు చేపట్టిన సోదాల్లో భాగంగా సత్యసాయి జిల్లా చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోదాల్లో పాల్గొన్న అధికారులు స్పష్టమైన సమాచారం తెలపలేదు. ఫిర్యాదులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా జరిగే సోదాల్లో చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోదా చేస్తున్నామని ఓ అధికారి తెలిపారు. పూర్తి విషయాలు తెలియాల్సి వుంది.

పశుపతి నాథుని ఆలయాన్ని సందర్శించిన జిల్లా జడ్జి

స్వామివారిని దర్శించుకుంటున్న జడ్జి కుటుంబ సభ్యులు

రాయదుర్గం రూరల్ నవంబర్ 5 ప్రభాతవార్త

మండలంలోని చ్నద గొల్లల దొడ్డి గ్రామ సమీపంలో లింగాల బండపై వెలసిన పశుపతినాథ్ ఆలయాన్ని ఏసీ ఎస్టీ కమిషన్ అదనపు జడ్జ్ సాదుబాబు బుధవారం సందర్శించారు. ఎస్సీ ఎస్టీ జిల్లా అదనపు జడ్జ్ సాధు బాబు కుటుంబ సమేతంగా ఆలయని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జడ్జ్ ఆలయ చరిత్రను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు జడ్జి కుటుంబ సభ్యులకు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా డి హిరే హాల్ మండలం మురిడి గ్రామంలో వెలిసిన శ్రీ ముడి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్యే నారా లోకేష్ పర్యటనకు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న కళ్యాణదుర్గం

పర్యటన విజయం వంతం చేయడానికి రేయింబవళ్లు శ్రమిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

అనునిత్యం పర్యటన ఏర్పాట్లలో ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం నవంబర్ 5 ప్రభాతవార్త

రాష్ట్ర విద్య ఐటీ శాఖ మంత్రి యువ అధినేత నారా లోకేష్ ఈనెల 8వ తేదీన భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణకు హాజరవుతున్న సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది ఎలాగైనా పర్యటనను విజయవంతం చేయాలని పట్టుదల కసితో స్థానిక ఎమ్మెల్యే ఆమిలినేని సురేంద్రబాబు రేయింబవళ్లు సిబ్బందితో కలసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు అయ్యప్ప స్వామి మాల ధరించినప్పటికీ ఇబ్బందులను ఎదుర్కొంటూ కృషితో ప్రతి ఒక్కరి సహకారంతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడంలో నిమగ్నమయ్యారు పార్టీ శ్రేణులను ఒకవైపు అధికార యంత్రాంగం మరొకవైపు ఎవరి పనులు వారు చెక్కబెడుతూ పర్యటనను విజయవంతం చేసి కళ్యాణదుర్గాన్ని మరపురాని పట్టణంగా చేయాలన్న కృత నిశ్చయం తో పనిచేస్తున్నారు రహదారుల విస్తరణతో పాటు విద్యుత్ కాంతులు విరజిమ్మడానికి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడానికి స్తంభాలను అమర్చుతూ మరొక వైపు రహదారికి అడ్డంగా ఉన్న వాటిని తొలగిస్తూ సువిశాలమైన రహదారులను ఏర్పాటు చేస్తూ అధికారులు శ్రామికులతో పని చేయించడం కనిపిస్తోంది భక్త కనకదాసు సర్కిల్ నందు ఆక్రమణం తొలగిస్తూ సభకు విచ్చేసే ప్రజానీకానికి భోజన ఏర్పాట్లు మరియు పార్కింగ్ స్థలాలను సూచిస్తూ ఆయా రహదారులలో వివిద మండలాల నుంచి వచ్చే వేలాదిమంది ప్రజానీకానికి ఏర్పాట్లలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయడానికి ఆయన శ్రమిస్తున్న దృశ్యాలు కంటికి కనిపిస్తున్నాయి ఏదైనప్పటికీ ఎమ్మెల్యేని గత నెలలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమాన్ని కూడా ఏర్పాట్లు తనదైన శైలిలో చేసి అందరి మన్ననలు పొందారు ఈ కార్యక్రమం అనంతపురం జిల్లా కేంద్రంలో రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంగా నిలబడింది మంత్రి నాలో లోకేష్ ఈనెల 8న కనకదాసు జయంతి రాష్ట్ర పర్వదినంగా నిర్వహిస్తూ ప్రభుత్వం ప్రకటించింది అదే రోజు కళ్యాణదుర్గం నందు భక్త కనకదాసు విగ్రహ ఆవిష్కరణ చేసి మరుపురాని ఘట్టంగా చేసి కళ్యాణదుర్గం చరిత్ర పుటలలో నిలిచిపోయే విధంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. స్థానిక డిఎస్పి రవిబాబు మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఈ ఈ ఎలక్ట్రికల్ రాజశేఖర్ పోలీస్ సిబ్బంది తదితర శాఖలకు సంబంధించిన వారందరూ కలిసికట్టుగా పనిచేస్తూ ఎమ్మెల్యేకు సహకారం అందిస్తున్నారు.

భైరవానితిప్ప ప్రాజెక్టును సందర్శించిన అధికారులు

గుమ్మఘట్ట నవంబర్ 05 ప్రభాతవార్త

ప్రాజెక్టు వివరాలు అధికారులు ను అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్

భైరవానితిప్ప ప్రాజెక్ట్ ను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రిహార్ సందర్శించారు భైరవాని తిప్ప ప్రాజెక్ట్ యొక్క వివరాలు అధికారులు ను అడిగి తెలుసుకున్నారు ప్రాజెక్టు ఇన్లో అవుట్ ప్లో ప్రస్తుతం నీటి మట్టం ప్రాజెక్టు సామర్థం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బిటిపి చిన్న కృష్ణ ప్రాజెక్టు గురించి కొన్ని విషయాలు అసిస్టెంట్ కలెక్టర్ తో పంచుకున్నారు ఆయన వెంట డీఈ గీతలక్ష్మీ జెఈ హరిష్ బిటిపి చిన్న కృష్ణ వీఆర్వో రమేష్ సచివాలయం సిబ్బంది ఉన్నారు

రైల్వే ప్రాంగణంలో ఎగిరిన జాతీయ జెండా

గుంతకల్ రైల్వే నవంబర్ 5 : ప్రభాతవార్త

వార్త ప్రభావం

ఎగురుతున్న జాతీయ జెండా

వార్త పత్రికలో వచ్చిన ఎగరని జాతీయ జెండా కథనానికి స్పందించి అదేరోజు సాయంత్రంలోపు అధికారులు ఎట్టకేలకు ఎగరవేశారు. రైల్వే స్టేషన్ ఎదురుగా జాతీయ జెండా రెపరెపలా లాడింది. జాతీయ జెండాను ప్రతి భారతీయుడు గుర్తించి గౌరవించాలని జెండా ఎగరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. రైల్వే అధికారులకు వార్త పత్రికలో వచ్చిన కథనాన్ని చూసి త్వరగా స్పందించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుత్తి శివారులో రైల్వే గేట్ మూసివేత

గుత్తి, నవంబర్ 5 ప్రభాతవార్త

రైల్వే గేట్ మూసివేస్తున్నట్లు బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

గుత్తి పట్టణం శివారు ప్రాంతంలో ఉన్న 44వ జాతీయ రహదారికి అనుసంధానమైన సర్వీసు రోడ్డులో, ప్యాపిలి రైల్వే గేట్‌ను తాత్కాలికంగా మూడు రోజుల పాటు మూసి వేస్తున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్‌బాబు తెలిపారు. రైల్వే గేట్ సమీపంలో 179 నెంబర్ రైల్వే ట్రాక్ వద్ద మరమ్మత్తులు జరుగుతున్న దృష్ట్యా తాత్కాలికంగా రైల్వే గేటును మూసివేస్తున్నామన్నారు. ప్రయాణికులు గమనించి హైవే ద్వారా తమ రాకపోకలను కొనసాగించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

విద్యుత్ కాంతులతో రంగనాథ స్వామి రాజగోపురం

పాల్గొన్న భక్తులు

హిందూపురం టౌన్ నవంబర్ 5 ప్రభాతవార్త

శివకేశవుల ఆరాధనకు ఎంతో పవిత్రమైన కార్తీక మాసంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం హిందూపురం పరిసర ప్రాంతాల్లో వైభవంగా వేడుకలు జరిగాయి. గుడ్డం శ్రీ రంగనాథ స్వామి దేవాలయ వద్ద వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాజగోపురం విద్యుత్ దీపాలంకరణలో శోభాయమానంగా కనిపించింది. శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు ని పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు. ప్రధానార్చకులు గోవింద శర్మ రాజ్యలక్ష్మి మోహన్ దంపతులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పేట శ్రీ వెంకటరమణ స్వామి ఆలయంలో కమిటీ అధ్యక్షులు భగీరథి నవీన్ ఆధ్వర్యంలో జ్వాలాతోరణం ఘనంగా జరిగింది. కిరికెర సెరికల్చర్ కాలనీ వద్ద ఉన్న శ్రీనగర్ కాలనీలో శివాలయం, కోట, శ్రీకంఠాపురం మొదలగు ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దీపాలను వెలిగించారు.

బాధితురాలకు టిడిపి చేయూత

హిందూపురం నవంబర్ 5 ప్రభాతవార్త

పరిహారం అందిస్తున్న దృశ్యం

మండలం కిరికెర పంచాయితీ వీవర్స్ కాలనీలో ఉంటున్న చిరంజీవి పద్మావతి వారి కూతురు బసవ నవల్లి స్కూల్లో ఆరవ తరగతి చదువుతున్న మేఘన ఇటీవల స్కూల్ కి వెళుతూ రోడ్డు క్రాస్ చేసే తరుణంలో ప్రమాదానికి గురి అయింది. కుడికాలు తీవ్రంగా దెబ్బతినగా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న చిన్నారికి టిడిపి నాయకులు చేయూత అందించారు. ఎమ్మెల్యే కార్యదర్శి శ్రీనివాసులు రూ.10 వేలు, మంగేష్ రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో బాలాజీ,ఆనంద్ పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం శ్రీ పార్వతీ పరమేశ్వర కల్యాణం

కనేకల్లు నవంబర్ 05 ప్రభాతవార్త

శివపార్వతుల కల్యాణం

కనేకల్లు మండల కేంద్రంలో గల శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ పార్వతి పరమేశ్వరులకు కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కనుల పండుగగా నిర్వహించారు. శ్రీ చిక్కనేశ్వర దేవాలయం నందు కార్తీక మాసం బుధవారం సాయంత్రం స్వాముల మంత్రాల మధ్య శివపార్వతుల కళ్యాణం చూడడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఇది కదా మా భాగ్యం ఇంతకన్నా కావాల్సింది ఏమి ఆ దేవదేవుని కళ్యాణం చూసి మా జన్మ తరించింది అంటూ ప్రజలు తన్మయత్వం చెందారు.పూజలు ఈకార్యక్రమంలో వేలాది భక్తులు పాల్గొన్నారు కార్తీకమాసం సందర్భంగా ఆలయంప్రాంగణంలో దీపారాధనలు మహిళలు దీపోత్సవం నిర్వహించారు. కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయమంతా విద్యుత్ అలంకరణ ఎంతగానో ప్రజలను ఆకర్షించింది. ఉదయాన్నే స్వామివారికి గంగపూజ రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. శ్రీ చిక్కనేశ్వర స్వామి అంటేనే కనేకల్ మండలంలో ఒక నమ్మకం ఒక ఆశ ఎంత బాధతో ఉన్నా ఎన్ని కష్టాల్లో ఉన్న ఒక్కసారి ఆ చిక్కనేశ్వర స్వామిని దర్శించుకుంటే చాలు మా కష్టాలన్నీ తొలిగిపోతాయని భక్తుల విశ్వాసం అనంతరం భక్తులకు ప్రసాదం వినియోగించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి-ఎంపీపీ లక్ష్మీదేవి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి

శెట్టూరు, నవంబర్ 05 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తీర్చి ప్రభుత్వాలు ప్రజా ప్రతినిధులు ప్రజలకు మంచి పరిపాలన అందించాలని ప్రతి మూడు నెలలకు ఒకసారి సర్వసభ సమావేశానికి ప్రతి మండల అధికారులు కచ్చితంగా హాజరు కావాలని ఎంపీపీ సూచించారు సమస్యలపరిష్కారానికి మండల స్థాయి సమావేశాన్ని ఏర్పాటుచేస్తారు.ఇందులో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ లక్ష్మీదేవి జడ్పీటీసీ మంజునాథ్, ఎంపీడీఓ జిలన్ భాష అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు ఈసందర్భంగా ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ మండల సమస్యల పైన అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ లక్ష్మీదేవి సూచించారు ముందుగా మండల అధికారులు అభివృద్ధి సంక్షేమ పథకాలపై నివేదికను చదివి వినిపించారు మండల వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని లేదంటే చర్యలుచేపడతామని ఎంపీపీ లక్ష్మీదేవి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపీడీవో రఘు రామారావు వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప మండల స్థాయి అధికారులు సురేంద్ర ప్రసాద్, ఎంఈఓ శ్రీధర్ , హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఏపీఓ నీరజ, వ్యవసాయ అధికారి వాసుకి రాణి,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్‌లో రజతోత్సవ వేడుకలు

గుత్తి, నవంబర్ 5 ప్రభాతవార్త

ప్రత్యేక పూజలు చేసిన దృశ్యం

మండలంలోని సేవాఘడ్‌లో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ దేవస్థానం రజతోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని లక్ష దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా అష్టలక్ష్మికి 108 కిలోల కుంకుమతో అర్చన గావించారు. జగదాంబ ఆలయంలో శ్రీదేవి భూదేవి సహిత శ్రీవెంకటేశ్వరస్వామికి కళ్యాణోత్సవం, శ్రీఉమామహేశ్వరస్వామికి కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి, సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు అర్చనలు గావించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జగన్నాథరావు, ధర్మకర్త మహారాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు వెంకటరమణనాయక్, డాక్టర్ శ్రీరాములు, సుధాకర్, నారాయణ, శివనాయక్, మల్లికార్జున, మోతిచంద్‌చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో వైభవంగా ప్రారంభమైన కడ్లే గౌరమ్మ ఉత్సవాలు

-భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహం ఊరేగింపు, ప్రత్యేక పూజలు

ఉరవకొండ, నవంబర్ 5 ప్రభాతవార్త

స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం కార్తీక పౌర్ణమి బుధవారం పట్టణంలోని 13వ వార్డులోగల ఆలయంలో కడ్లే గౌరమ్మ అమ్మవారి నోముల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మేళతాళాలతో మల్లేశ్వరస్వామి ఆలయం నుంచి గంగనీటి ఊరేగింపు, పిండికూర విజయ్‌కుమార్ ఇంటివద్ద నుండి అమ్మవారి ఊరేగింపు నిర్వహించి ఆలయంలో కొలువుదీర్చి వేద పండితులు ఒ.కె.పద్మనాభస్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 6వ తేదీ గురువారం అమ్మవారి పూజలు, నోములు, రాత్రి వీరాంజినేయస్వామి భక్తమండలిచే భజన కార్యక్రమం, 7వ తేదీ శుక్రవారం ఉదయం పూజలు, నోములు, బృందావన కోలాటం, 8వ తేదీన శనివారం రాత్రి దీపాల హారతులను ఊరేగింపుగా తీసుకెళ్లి నీలకంఠేశ్వరస్వామి వారికి సమర్పించడం జరుగనుంది. 9వ తేదీన ఆదివారం పూజల అనంతరం మేళతాళాలతో అమ్మవారి ప్రతిమను ట్రాక్టర్ లో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గవిమఠం ఆవరణం లోని బావిలో నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

- పేద విద్యార్థులకు చదువును దూరం చేయవద్దు..

- వైఎస్ఆర్‌సిపి మండల నాయకులు

బెలుగుప్ప, నవంబర్ 5 ప్రభాతవార్త

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సిపి నాయకులు

ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య చదువును, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని దూరం చేయాలన్న ఉద్దేశ్యంతోనే పిపిపి విధానాన్ని ప్రవేశ పెట్టి పేదలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తోందని వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ మచ్చన్న, రాష్ట్ర బిసి సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం వారు మండల కేంద్రంలో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడుతూ.. వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చి పేద ప్రజలకు వైద్య విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలన్న మంచి ఉద్దేశ్యంతో ముందుకెళ్తే దానిని భ్రష్టు పట్టిస్తూ వాటిని పిపిపి విధానంలోకి తేవడం సరైంది కాదని విమర్శించారు. పేదల గురించి ఆలోచించేది ఒక్క వైఎస్ఆర్ కుటుంబమేనన్నారు. అప్పట్లో వైఎస్.రాజశేఖర్ హయాంలో పేదలకు వైద్యం అందడం లేదని గమనించే 108, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను తీసుకొచ్చి ప్రతి పేదవానికి కార్పోరేట్ వైద్యాన్ని అందించారన్నారు. కాని మీరు వచ్చిన ప్రతి సారి వైద్యాన్ని, విద్యను పేదలకు దూరం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ప్రస్తుతం ఒక్కటి కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు వంటివి అనేకం ఉన్నాయన్నారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని ఇప్పటికే ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువైందన్నారు. మీరు ప్రజల్లోకి వస్తే మీ పార్టీ వారు తప్పా సామాన్య ప్రజలు ఎవరూ గుర్తించడం లేదని పేర్కొన్నారు. మీకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు పురుషోత్తమ, అంగడి ఎరిస్వామి, పూల ప్రసాద్, తిప్పేస్వామి, ఎస్సీ సెల్ శ్రీనివాసులు నాయక్, తిమ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయకూడదు

-వైకాపా నియోజకవర్గం ఇన్‌చార్జ్ దీపిక

లేపాక్షి, నవంబర్ 5 ప్రభాతవార్త

రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైకాపా ఇన్‌చార్జ్ దీపిక

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించరాదని హిందూపురం నియోజకవర్గం వైకాపా ఇన్‌చార్జ్ దీపిక పేర్కొన్నారు. బుధవారం నాయనవల్లి, బిసలమానేపల్లి గ్రామాల్లో వైకాపా మండలకన్వీనర్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమంతో పాటు కోటి సంతకాల సేకరణ కొనసాగింది. ఈ సందర్భంగా దీపికమాట్లాడుతూ వైకాపానాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఎన్నికల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. 2029 ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వాన్ని ఏర్పాటు

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త

స్థానిక యస్వీ డిగ్రీ, పిజి కళా శాలకు చెందిన మొదటి సంవ త్సరం బిబిఎ చదువుతున్న జి.మల్లికార్జున అను విద్యార్థి అండర్-23 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జట్టులో చోటు దక్కించుకోవడం అభినందనీ యమని కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి బుధ వారం ఓ ప్రకటనలో తెలి పారు. ఈనెల 9 నుండి బరోడాలో బిసి సిఐ ఆధ్వర్యంలో నిర్వహించే వన్డే క్రికెట్ మ్యాచ్‌కి ప్రాతినిధ్యం వహించనున్నాడని తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ఎ. వి.ప్రసాద్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎ.శ్రీనాథ్, పి.డి యం.శ్రీని వాసులు నాయక్, అధ్యాపకులు ఎం పికైన విద్యార్థిని అభినందించారు.

డిఎస్‌సిలో నూతనంగా రిక్రూట్ అయిన ఉపాధ్యాయులకు సిఎల్‌లు, ఒహెచ్‌లను మంజూరు చేయాలి - ఎస్‌టియు డిమాండ్

అనంతపురం న్యూటౌన్,
నవంబర్ 5 ప్రభాతవార్త

ఎన్.రమణా రెడ్డి

డిఎస్‌సి-2025ద్వారా రిక్రూట్ అయి నూతన గా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారందరికీ తప్పకుండా సిఎల్‌లు, ఒహెచ్‌లను మంజూరు చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు ఎన్.రమణా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాం జనే యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్టోబర్ 3న ఉపాధ్యాయ వృత్తిలో చేరి ఒక నెల పూర్తి అయినప్పటికీ సిఎల్‌లు, ఒహెచ్ లకు అర్హత లేదని జిల్లాలోని చాలా మండలాలలో, ఉన్నత పాఠశా లల్లో ఇవ్వక పోవడాన్ని ఎస్‌టియు జిల్లా శాఖ పక్షాన ఇది అన్యాయమని ఉద్యోగము వచ్చింది అనే సంతోషాన్ని కుటుంబ ము, పిల్లలతో గడపడానికి నెలకు రావాల్సిన సిఎల్‌లు, ఒహెచ్‌లను లీప్ యాప్‌లో పొందుపరచక పోవడం అన్యాయం అని దాని సాకుతో సిఎల్‌లు ఒహెచ్‌లను ఇవ్వక పోవడా న్ని ఖండిస్తూ తప్పకుండా వారికి రావాల్సిన సిఎల్‌లు, ఒహెచ్ లను మంజూరు చేయాలని ఎస్‌టియు జిల్లా శాఖ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు ఎంపిక

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రాప్తాడు, నవంబర్ 5 ప్రభాతవార్త

రాప్తాడు మండలం నుండి జిల్లా స్థాయి చెకుముకి సంబరా లకు రెండు జట్లు ఎంపికైనట్లు జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు,మండల కన్వీ నర్ ఎం.శాంతరాజు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విభాగం నుండి ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల 8, 9, 10 తరగతి విద్యార్థులు కె.జ్ఞానేశ్వర్‌రెడ్డి, వై.త్రిలోచన్, జి.వెంకట సాయిలు ఎంపిక అయ్యారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల విభాగం నుండి మాంటి స్సోరి ఎలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్,గొల్లపల్లి 8, 9, 10వ తరగతికి చెందిన విద్యార్థులు పి.అమరేశ్వర్‌రెడ్డి, పి.దర్శన్ రెడ్డి, కె.సాయి చరితలు ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరంతా కూడా రాప్తాడు మండలం తరపున ఈనెల 23న జరిగే జిల్లాస్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని వారు తెలియజేశారు.

మాకు మరింత సమయం ఇవ్వాలి - అపుస్మా నేతలు

అనంతపురం న్యూటౌన్,
నవంబర్ 5 ప్రభాతవార్త

అధికారులకు వినతిపత్రం ఇస్తున్న అపుస్మా నేతలు

బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రభుత్వం నుంచి నోటీసులు వచ్చాయని, కాకపోతే ఈ నెల 10న చివరి తేదీగా ఇవ్వడం తక్కువ సమ యమని కావున ఈ సమయాన్ని మరింత పొడిగించాలని అపుస్మా నేతలు బుధవారం ప్రభుత్వా న్ని కోరారు. ఈ సందర్భంగా మంత్రిని, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌ని కలిసినట్లు వారు పేర్కొన్నారు.

ఘనంగా శివపార్వతుల కళ్యాణం

స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు, నవంబర్ 5 ప్రభాతవార్త

కార్తికపౌర్ణమిని పురస్కరించుకుని పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరు సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన పవిత్రపుణ్యక్షేత్రం అశ్వత్థంలో బుధవారం శివపార్వతుల కళ్యాణాన్ని వేదపండితులు బాలసుబ్రమణ్యశర్మ శాస్త్రోక్తంగా కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవను మేళతాళాల నడుమ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పౌర్ణమి సందర్భంగా శ్రీఅశ్వత్థనారాయణస్వామి, శ్రీచక్రభ్రీమలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సుబ్రమణ్యం, ఆలయ సిబ్బంది గుర్రప్ప, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

దోన రామేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు

శింగనమల, నవంబర్ 5 ప్రభాతవార్త

ప్రత్యేక అలంకరణలో దోన రామేశ్వర స్వామి

మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో వెలిసిన దోణరామేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఘనంగా కార్తిక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా భక్తి తరంగాలు అలుముకున్నాయి. కార్తిక మాసం రెండో వారం కార్తిక పౌర్ణమి కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అలంకారణలు, దీపారాధనలు చేశారు. రంగురంగు పూలతో స్వామివారిని విద్యుత్ దీపాలంకరణలతో ఆలయాన్ని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. హారతులతో ఆలయ ప్రాంగణం ఆద్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. స్థానికులు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దోణ రామేశ్వర స్వామిని

కార్తిక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

దర్శించుకుని కార్తిక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

శింగనమలలో.. మండల కేంద్రంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా సీతారామలక్ష్మణులను ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దీపారాధనలు చేశారు.

పిపిపి విధానంతో పేదలకు వైద్యం భారం

- మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్

అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ ఫరం చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్యతోపాటు, పేదలకు వైద్య సేవలు దూరం అవుతాయని వైసిపి మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్లా బేగ్ పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాలు కార్యక్రమంలో భాగంగా నగరంలోని 29వ డివిజన్‌లో సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ, దుకాణాల వద్దకు వెళ్లి పిపిపి విధానంతో జరిగే నష్టాన్ని వివరించి పిపిపికి వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ఈ సందర్భంగా సైఫుల్లా బేగ్ మాట్లాడుతూ.. వైసిపి హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పిపిపి విధానాన్ని తీసుకొచ్చి ప్రైవేట్‌కు మెడికల్ కళాశాలలను అప్పగి చడం దురదృష్టకర మన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చు కోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం నగర కార్యదర్శి షేక్ జావిద్, మైనార్టీ

వ్యాపారితో కోటి సంతకాలు చేయిస్తున్న మైనార్టీ నేతలు

నాయకులు హుస్సేన్ పీరా, మనోజ్‌కుమార్, ఖాదర్ బాషా, పొగల అబ్జాల్ తదితరు లు పాల్గొన్నారు.

జగన్‌పై కక్షతో ప్రైవేట్‌కు మెడికల్ కళాశాలల అప్పగింత

- వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి

అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై కక్షతో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలల పిపిపి విధానంలో ప్రైవేట్ పరం చేస్తోందని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి పేర్కొన్నారు. వైసిపి ఆధ్వర్యంలో చేపడుతున్న కోటి సంతకాల ఆధ్వర్యంలో నగరంలోని 36వ డివిజన్‌లో ప్రజల వద్దకు వెళ్లి పిపిపి విధానానికి వ్యతిరేకంగా సంతకాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు పేద విద్యార్థులకు మెడికల్ సీట్లను చేరువ చేయాలన్న సంకల్పంతో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చార న్నారు. అయితే ఇప్పటికే కొన్ని కళాశాలలు ప్రారంభమై, మరికొన్ని నిర్మాణ దశలో ఉండటంతో కక్ష పూరితంగా కూటమి ప్రభుత్వం పిపిపి విధానం తీసుకొచ్చిందన్నారు. కోటి సంతకాల కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పిపిపి విధానానికి వ్యతిరేకంగా సంతకాలు చేస్తున్నా రన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చు కోవాలన్నా రు. కార్యక్రమంలో మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జానీ, యువజన విభాగం నగర ఉపాధ్యక్షులు బోయ వినిత్, మున్సిపల్ విభాగం నగర ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, నాయకులు మసూద్ తదితరు లు పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పైన జిల్లా పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా. సిఐటియు

అనంతపురం రూరల్, నవంబర్ 05 ప్రభాతవార్త :

బకాయిపడినవేతనాలు,సమస్యలు పరిష్కారం కోసం. ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో, నేడు జిల్లా డిపిఓ ఆఫీస్ వద్ద పెద్ద ఎత్తున కార్మికులు ధర్నా చేపట్టడం జరిగింది. అంతకుమునుపు స్థానిక రుద్రంపేట బైపాస్ నుంచి ర్యాలీగా జిల్లా డిపిఓ ఆఫీస్ వరకు కొనసాగి, డిపిఓ ఆఫీస్ వద్ద బైఠాయించారు. ఈ ధర్నాకు గ్రామపంచాయతీ జిల్లా నాయకులు భాషా అధ్యక్షత వహించగా, గ్రామపంచాయతీయూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మున్సిపల్ యూనియన్, రాష్ట్ర అధ్యక్షులునాగభూషణ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు575గ్రామ పంచాయతీలు ఉంటే అందులో నిత్యం పంచాయతీలో పరిశుభ్రంగా ఉండడానికి గ్రామపంచాయతీ కార్మికులే కీలకమని, రోడ్లు కాలువలు వీధి దీపాలు నీటి సరఫరా ఇంటి గుత్తలు అనేక రకాల పనులు చేస్తూ పంచాయతీ అభివృద్ధికి కార్మికులు పాటుపడుతుంటే, నెలలు తరబడి జీతాలు చెల్లించ కుండా, కార్మికులతో వెట్టిచాకిరిచేయించుకుంటున్నారని, అధికారు లను జీతాలు అడుగుతే పంచాయతీలలో ఆదాయం లేదంటున్నారని, మండిఎ డ్డారు. అనంతపురం రూరల్ పంచాయతీ మూడు నెలలు, ఆత్మకూరు, బుక్కరాయసముద్రం, మూడు నెలలు, రుద్రంపేట రెండు నెలలు, వజ్రకరూరు ఏడు నెలలు, ఇలా అనేక పంచాయతీలో వేతనాలు పెండింగ్ ఉన్నాయని,ప్రతి సంవత్సరం తీసుకోవాల్సిన పోస్ట్ శాంక్షన్ లు సంవత్సరాల తరబడి పెండింగ్ ఉన్నాయని, పోస్ట్ శాంక్షన్ లో కార్మికుల పేర్లు కనబరచడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగునంగా జీతాలు కూడా పెంచాలని, మున్సిపల్ కార్మికులు చేస్తున్న పనే, గ్రామపంచాయతీ కార్మికులు కూడా చేస్తున్నారని, వారికి చెల్లిస్తున్న మాదిరి 21000 గ్రామపంచాయతీ కార్మికులకు కూడా చెల్లించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే పంచాయతీలతో సంబంధం లేకుండా నేరుగా జీతాలు ఇస్తున్నారని ఇక్కడ కూడా అదే రకంగా,చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ,సౌకర్యం కల్పించి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికుల పైన అధికారులు, ప్రజాప్రతినిధుల వేధింపులు అపాలని, వీటన్నిటి సమస్యల పరిష్కారం కోసం అధికారులతో,కార్మిక నాయకులతో జాయింట్ సమావేశం వేయాలని పట్టు పట్టారు. ధర్నా దగ్గరికి

డిపిఓ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు.

వచ్చిన ఏవో నాగరాజు,జిల్లా డిపిఓ అందుబాటులో లేనందువల్ల ఫోన్లో మాట్లాడి, ఈనెల 14వ తారీఖున జాయింట్ సమావేశం వేస్తామని, సమావేశంలో పరస్పరం సహకరించుకొని సమస్యలుపరి ష్కరించుకుందామని తెలిపారు. అనంతరం ఏవో నాగరాజు కి వినతిపత్రం ఇచ్చి ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలోగ్రామపంచాయతీ యూనియన్ నాయకులు, మధు, నాగేంద్ర, పెద్దన్న, మూర్తి,వేణు, వీరాంజి, శ్రీనివాసులు, అనంత పురం నియోజకవర్గ నాలుగు పంచాయతీలు, రుద్రంపేట నారాయణ పురం,అనంతపురం రూరల్, రాజీవ్ కాలనీ, కక్కలపల్లి కాలనీ,అక్కంపల్లి, బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె, కల్లూరు, వజ్రకరూరు, ఆత్మకూరు, తదితర పంచాయతీల,నుండి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రచ్చబండ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి..

వైకాపా మండల కన్వీనర్ మొండెం రవికుమార్ రెడ్డి

నల్లచెరువు నవంబర్ 05 ప్రభాత వార్త న్యూస్ : నల్లచెరువు మండల పరిధిలో లోని అల్లుగుండు, బాలేపల్లి తాండ,నల్లచెరువు గ్రామపంచాయతీలోని దేవరింటి పల్లి గ్రామాలలో గురువారం కదిరి అసెంబ్లీ సమన్వయ కర్త బి ఎస్ మక్బూల్ అహమ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ పార్టీ నల్లచెరువు మండల కన్వీనర్ మండెం రవికుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజి లను ప్రైవేటి కరణ చేస్తున్న తరుణంలో మెడికల్ కాలేజీ లను ప్రయివేటి కరణను నిలిపివేయాలనే ఉద్దేశంతో వైసీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తలపెట్టారని,రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాల పత్రాలను మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహనరెడ్డి రాష్ట్ర గవర్నర్ కు సమర్పించడం జరుగుతుందని,నల్లచెరువు మండల వైసీపీ పార్టీ,మండల సీనియర్ నాయకులు,సర్పంచ్ లు,ఎంపీటీసీలు,వార్డు మెంబెర్లు,మండల కమిటి సభ్యులు మరియు వైసీపీ పార్టీలో మండలంలో వివిధ అనుభంద విభాగాల

, మొండెం రవి కుమార్ రెడ్డి

పదవిలలో కొనసాగుతున్న ముఖ్య నాయకులు వైయస్సార్ కుటుంభ సభ్యులందరు ప్రతి ఒక్కరూ పాల్గొని రచ్చబండ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

బి.యాలేరులో పాలం పిలుస్తోంది

రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ విజయకుమార్

ఆత్మకూరు, నవంబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని బి. యాలేరు గ్రామంలో మండల వ్యవసాయాధికారి జ్యోతి విజ యకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్ర మాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రైతులతో ఖరీఫ్,రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలలో పాటిం చవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. మండ లంలో కంది పంటను రైతులు సాగు చేశారని,కంది పంట గింజ ఏర్పాడే దశలో ఉందని రైతులు సరైన సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే మ ంచి దిగుబ డులు సాధించవచ్చుని తెలిపారు.రైతులకు మంచి దిగుబడి సాధించుటకు పలుసూచనలు రైతులకు తెలియచేశారు.ఈ నెల 15వ తేది వరకు రైతులు పప్పు శెనగను విత్తు కొనుటకు సమయం ఉందని ఏఓ తెలిపారు.ఈ కార్యక్ర మంలో వ్యవసాయ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లును పరిశీలించిన ఎంపిడిఓ లక్ష్మినరసింహ

గోకులం షెడ్లును పరిశీలిస్తున్న ఎంపిడిఓ లక్ష్మినరసింహ,సిబ్బంది

ఆత్మకూరు, నవంబర్ 5 ప్రభాతవార్త

మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన గోకులం షెడ్ల్ నిర్మాణ పనులను పరిశీలిం చారు.బుధవారం మది గుబ్బ గ్రామంలో ఎంపిడిఓ లక్ష్మి నరసి ంహ పర్యటించి రైతులు నిర్మిం చుకున్న గోకులం షెడ్లును పరిశీ లించారు.ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ఆత్మకూరు మండలానికి మొదటి విడతగా 98 గోకు లం షెడ్లు మంజూరు కాగా అందులో మంజూరైన అన్ని పూర్తి చేయడం జరిగిం దన్నారు.రెండవ విడతగా వచ్చిన 131 షెడ్లు మంజూరుకాగా అందులో 12 పూర్తి కాగా మిగిలినవి నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు.ఒక్కొక్క షెడ్‌కు రెండు లక్షలు రూపాయలు మంజూరు అవుతున్నదన్నారు.ప్రభుత్వ నిబం ధనలు మేరకు షెడ్ల్ నిర్మించుకుంటే వీలైనంత త్వరగా బిల్లులు చెల్లిస్తా మన్నారు.లబ్దిదారులు మంజూరైన షెడ్లను పూర్తిచేసుకోవాలని కోరారు.ఉపాధి హామీ పథకం నందు పనిచేస్తున్న వారికి జరుగుతున్న ఈకేవైసీ సర్వేనందు నూరు శాతం పూర్తి చేయుటకు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో టెక్నికల్ అసిస్టెంట్ బబ్లు,టిఏలు గురులక్ష్మి, పంచాయితీ కార్యదర్శి మురళి,ఫీల్డ్ అసిస్టెంట్ కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి

కనకదుర్గమ్మ ఆలయం దర్శన అనంతరం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, తదితరులు

అనంతపురం నవంబర్ 05 ప్రభాతవార్త

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజయవాడ కనకదుర్గ మ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. టిడిపి నాయకులు, సన్నిహితులతో కలిసి ఆయన బుధవారం ఆలయానికి వెళ్లారు. అధికారులు, అర్చకులు ఎమ్మె ల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్తీక పౌర్ణమి సందర్భంగా దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ స్వామివారిని దర్శనం చేసుకుని కార్తీక దీపం వెలిగించారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశా రు. కార్తీక పౌర్ణమి సంద ర్భంగా అమ్మవారిని, స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి దిశగా పయనించాలని ఆకాంక్షించారు. దుర్గా మల్లేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు.

అనంత వెంకటరామి రెడ్డికి వెడ్డింగ్ ఇన్విటేషన్ అందజేసిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు,
నవంబర్ 5 ప్రభాతవార్త

అనంత వెంకటరామిరెడ్డిని ఆహ్వానిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

తన సోదరుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి కూతురి వివాహానికి రావాలంటూ మాజి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిను రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజ కవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆహ్వానించారు. బుధవారం ఆ యన నివాసంలో కలిసిన తోపు దుర్తి ప్రకాష్ రెడ్డి వెడ్డింగ్ ఇన్విటేషన్ అందజేశారు. కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు. అదే విధంగా ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల నానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం సమన్వ యకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆహ్వానించారు. కుటుంబ సమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కోరారు..

CHANGE OF NAME

I, Vanarasa Azith Kumar, S/o. Vanarchi Rathnam, R/o. D.No. 28-6-174 (2), A.P.H.B. Colony, Ananthapuram, A.P., I have changed my name from Vanarasa Azith Kumar (Old Name) to **VANARCHI AZITH KUMAR** (New Name), Here after my name is known as **VANARCHI AZITH KUMAR**

04ATP05_04ATP05.qxd 05-11-2025 PM 10:56 Page 1

రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు రాష్ట్ర మంత్రుల పర్యటన పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సురేంద్రబాబు

- విద్యుత్ స్తంభాల మార్పు, విస్తరణ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మాణం వేగవంతం చేయాలి - భక్త కనకదాసు విగ్రహం వద్ద సభాస్థలి ఏర్పాటు పూర్తి చేయాలి - కనకదాస సర్కిల్ నుంచి వాల్మీకి సర్కిల్, గాంధీ చౌక్, టీ సర్కిల్, అంబెడ్కర్ విగ్రహం, రింగ్ రోడ్ వరకు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు

నారా లోకేష్ పర్యటనలు అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

రోడ్డు విస్తరణ, సర్కిల్ అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

కళ్యాణదుర్గం నవంబర్ 5 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భక్త కనకదాసు జయంతోత్సవం, కళ్యాణదుర్గం పట్టణంలో కనకదాసు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విచ్చేస్తున్న రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ పర్యటన కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆర్డీఓ, డీఎస్పీ, విద్యుత్ ఎస్ ఈ, మున్సిపల్ కమీష నర్ వివిధ శాఖల అధికారులతో కలసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురే ంద్రబాబు మాట్లాడుతూ పర్యటనకు రెండు రోజులే ఉన్నా యని విద్యుత్ అధికారులు స్థంబాల మార్పు, విద్యుత్ లైన్లు ఏర్పాటు పూర్తి చేయాలని, అలాగే రోడ్డు పక్కన ఉన్న మట్టి చదును చేసి ఎక్కడా కూడా గోతులు లేకుండా చూడాలని, పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా కనక దాస సర్కిల్ నుంచి పట్టణంలోని ప్రధాన సర్కిళ్లలో బండ్లు, ఇతర వాహ నాలు నిలబడకుండా చూడాలని ఏర్పాట్లన్ని పకడ్బందిగా చేయాలని ఎక్కడా కూడా నిర్లక్ష్ యంగా ఉండకూడ దని సూచించారు.. ముఖ్యంగా కనకదాస సర్కిల్లో పనులు వేగంగా చెపట్టాలని సభా వేదిక వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ రెడ్డి, డి ఇ ప్రసాద్, జాహ్నవి, విద్యుత్ శాఖ ఎస్సీ శేషాద్రి శేఖర్, డి ఈ ఈ రాజశేఖర్ విద్యుత్ సిబ్బంది, ఆర్డిఓ వసంత కుమార్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ఆధ్వర్యంలో శరవేగంగా శ్రీ కనకదాస సర్కిల్ సుందరీకరణ పనులు వేగంగా సాగుతున్నాయి. అన్ని సర్కిల్లో ట్రాఫిక్ ఎలాంటి అంతరాయం కలుగుకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకో వాలని నారా లోకేష్ రాష్ట్ర మంత్రుల పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు. పట్టణంలోని పలు రహదారుల విస్తరణ పనులతో పాటు చిన్న చిన్న ఆక్రమణలు తొలగిస్తూ అధికారులు కళ్యాణదుర్గాన్ని తీర్చిదిద్దు తున్నట్లు పట్టణ ప్రజలు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ప్రతిపక్ష నేత రామ్మోహన్ చౌదరి, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లి కార్జున, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయ లక్ష్మీదేవి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజశేఖర్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల కోసం మనమంతా బాధ్యతాయుతంగా పనిచేద్దాం

- అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించిన ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ఓబుళదేవరచెరువు, నవంబర్ 5, ప్రభాతవార్త :

ప్రజల సమస్యల పరిష్కారం కోసం మనమంతా బాధ్యతాయుతంగా పనిచేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడిఓ కార్యాలయంలో ఎంపీపి తుమ్మల పర్వీన్‌భాను అధ క్షతన నిర్వహించిన సాదారణ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అజెండాలోని అంశాలు, ఆశాఖలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని సభలో ఆయా శాఖల అధికారులు వివరించారు. ప్రధానంగా ఓడీసి మండల వ్యాప్తంగా గడచిన మూడు నెలల్లో కుక్కకాటు కేసుల నమోదు కావడం పట్ల ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేశారు. నవంబర్ ఆఖరులోగా కుక్కల సమస్యల పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల వివరాలను పాంప్లెట్‌లు వేయించి ప్రజల్లో విరివిగా ప్రచారం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, మురికినీటి కాల్వలు, వీధిలైట్లు సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. మండల వ్యాప్తంగా బాల్యవివాహాలు అత్యధికంగా నమోదువుతున్నాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులపై ఉందన్నా రు. సమస్యలపై ప్రజలు ఫోన్ చేస్తే అధికారులు సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధ్యాతారాహిత్యమే అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పలు శాఖల అనుసంధానంగా వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఆ శాఖల పురోగతి, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ పూల శివప్రసాద్, వైస్ ఎంపీపి తుమ్మల పర్వీన్‌భాను, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడిఓ శివరాంప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్డీ అంజినప్ప, పంచాయితీరాజ్ జేఈ వరప్రసాద్, ఏఓ ఇలియాజ్ అహ్మద్, డాక్టర్ భానుప్రకాష్, పశువైద్యులు ప్రవీణ్‌కుమార్, సిడిపిఓ గాయత్రి, ఏపియం రవీంద్ర, ఎంపీటిసి శ్రీనివా సులు, సర్పంచ్‌లు శంకర్‌రెడ్డి, వెంక టరమణప్ప, టిడిపి కన్వీ నర్ జయచంద్ర, అల్లాపల్లి పిఏసి ఎస్ అధ్యక్షుడు శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

శివనామస్మరణతో మారుమ్రోగిన శివాలయం

విశేష పూజలు అందుకున్న శ్రీ కాశీ విశ్వేశ్వరుడు - అన్నాభిషేకానికి తరలి వచ్చిన భక్తులు

బుక్కరాయసముద్రం నవంబర్ 5 ప్రభాతవార్త

కార్తీక మాసం కార్తీక శుద్ధ పౌర్ణమి సందర్భంగా శివనామస్మరణతో మారుమ్రోగిన శివాలయం, బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన శ్రీ కాశీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వం స్వామి దేవాలయంలో బుదవారం విశేష పూజలు అందుకున్న శ్రీ కాశీ విశ్వ నాథుడు 46వ అన్నాభి షేకానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొ న్నాట్లు దేవా లయం ప్రధానస్వామీజి శ్రీ అన్నామలై స్వామి తెలిపా రు.ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ కోరిన కోరికలు తీర్చి కొంగుబ ంగా రమైవెలసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి వారి అన్నాభిషేకం దర్శనము వలన సర్పపాపాలు తొలగి ఐశ్వర్యాభివృద్ధి కలుగును, స్వామి వారి అన్నాభిషేకం యెక్క అన్న ప్రసాదం స్వీకరిం చడం వలన స్వపాపాలు తొలగి ఆయురారో గ్యం కలుగనన్నారు. అనంతరం శ్రీ కాశీ విశాలాక్షి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి 46వ అన్నాభిషేకం స ందర్భంగా స్వామివారికి ఉదయం గణపతిపూజ, కలశ పూజ,సర్వాభిషేకం, అన్నాభిషేకం మహామంగళ హారతి,అన్నాభిషేక దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్ర మాలు నిర్వహించినట్లు ఆయ నతెలిపారు. మహిళా భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి కోరిన కోర్కెలు తీరాలని ముక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండ బారీగే ట్లను ఏర్పాటుచేసి సిఐ పుల్ల య్య ఆధ్వ ర్యలో బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు అర్చ కులు మణికంఠ,రమణ, అమ్మవారి స్వామి,దేవాలయం జీర్ణోద్ధారణ కమిటీ, ఓం నమ శివాయ సేవా సంఘం,శ్రీ కాశీ విశాలాక్షి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ సభ్యలు శివస్వాములు తదితిరులు పాల్గొన్నారు.

అన్నాభిషేకం అలంకరణ లో శ్రీ కాశీవిశ్వనాథుడు

ప్రత్యేక అలంక రణలో కాశీ విశాలాక్షి,

కార్తీక దీపాలు వెలుగిస్తున్న మహిళా భక్తులు

మల్లేశ్వర స్వామికి కార్తీక పౌర్ణమి వెలుగులు

కార్తీకప్రౌర్ణమి సందర్భంగా పోటెత్తిన భక్తజనం

- ఓం నమః శివాయ స్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

కోనేరు బావిలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా జడ్జి సాదు బాబు

కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తుల దృశ్యం

కంబదూరు, నవంబర్ 5, ప్రభాతవార్త

పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా కంబదూరు గ్రామంలోని పురాతనమైన మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే భక్తు లు వేల సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషే కాలు, అర్చనలు చేశారు.వేదమంత్రాల మధ్య ప్రత్యేక హోమ ం, దీపారా ధన, హరతి కార్యక్రమాలు నిర్వహించ ్గా, ఆలయ ప్రాంగణం "ఓం నమః శివాయ" నినాదాలతో మార్మోగింది. సాయంత్రం సమయ ంలో వేలాది దీపాలతో ఆలయం ప్రకాశవంతమైంది.

ఈ సందర్భంగా స్థానిక ప్రజా ప్రతి నిధులు, అధికారులు, భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. మహిళలు దీపాలతో కీర్తన లు చేస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఆహ్లాద కరంగా మార్చా రు.కా ర్తీక పౌర్ణమి రోజున స్వామి దర్శనం పొందితే పుణ్య ఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం .ఈ రోజు ఉపవాస దీక్షతో భక్తులు స్వామి సేవలో నిమగ్న మవుతారు" అన్నారు. మల్లేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా జడ్జి కార్తీక పౌర్ణమి సందర్భంగా కంబదూరు మల్లేశ్వర స్వామి వారిని జిల్లా జడ్జి సాదుబాబు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో దీపారా ధన, అభిషేక పూజలు నిర్వహిం చారు. జడ్జి దంపతులు స్వామి, అమ్మవాం్లకు ప్రత్యేక దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కోనేరు బావిలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుమును ఆలయ ఈవో దేవదాస్ , స్థానిక నాయ కులు జడ్జికి ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అండర్ డ్రైనేజ్ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయండి

- ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, నవంబర్ 5 ప్రభాతవార్త

అండర్‌డ్రైనేజి పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పెన్నానదిలో కలుస్తున్న డ్రైనేజి నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జె.సి మాట్లాడుతూ డ్రైనేజి పైపులైన్ పనులు పూర్తి చేసి పెన్నానదిలోకి డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పెన్నానదిలో కలుస్తున్న డ్రైనేజి నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నయాన్ సూపర్ సెంచురీతో డ్రాగా ముగిసిన ఆంధ్ర-పాండిచ్చేరి మ్యాచ్

అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త

ఆర్డిటి మైదానంలో జరుగుతున్న కల్నల్ సికె నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో పాండిచ్చేరి కెప్టెన్ నయాన్ కంగయాన్ సూపర్ సెంచురీతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కల్నల్ సికె నాయుడు ట్రోఫీ మ్యాచ్‌లో భాగంగా నల్గవ రోజు నాలుగు వికెట్లు కోల్పోయి 37 రన్నులతో మ్యాచ్ ప్రారంభం కాగా పాండిచ్చేరి జట్టు బ్యాటింగ్ చేపట్టగా కెప్టెన్ నయాన్ కంగయాన్ 214 బాల్స్ ఆడి 13 ఫోర్లు, ఒక సిక్స్‌తో 107 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అదే విధంగా ఆకాష్ 51 పరుగులు సాధించారు. 214 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయిన దశలో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఆంధ్ర భౌలర్లలో కెఎస్ఎన్ రాజు నాలుగు వికెట్లు, సుమిత్ ఒకటి, ఆదిత్యరెడ్డి ఒకటి తీశారు. మ్యాచ్ రెఫరీలతోపాటు పాండిచ్చేరి-ఆంధ్ర జట్లకు ఏడిసిఏ అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డిలు మెమెంటోలను అందించారు. ఆర్డిటి క్రీడా మైదానంలో అద్భుతమైన సౌకర్యాలతోపాటు మ్యాచ్‌లు ఆడేందుకు మెరుగైన సౌకర్యాలను కల్పించారని, ఇరుజట్లు క్యాప్టెన్లు కితాబిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

నయాన్ సూపర్ సెంచురీతో డ్రాగా ముగిసిన ఆంధ్ర-పాండిచ్చేరి మ్యాచ్

అనంత అంటే అభివృద్ధి కాదు.. అవినీతిమయం

ఎమ్మెల్యే దగ్గుపాటి గురించి మాట్లాడితే.. నీ అవినీతి చిట్టా విప్పుతాం ! - క్వాడర్ ని నాశనం చేసిన నీవు.. ప్రజాప్రతినిధా ? - కుల మత రాజకీయాలు చేసేది నీవే.. టిడిపి నాయకులు నలుబోలు మధు రాయల్

అనంతపురం. నవంబరు 05 ప్రభాతవార్త

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని నాశనం చేశారని తెలుగుదేశం పార్టీ నాయకులు నలుబోలు మధు రాయల్ ఎద్దేవా చేశారు. బుధవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ లోకల్ కాదంటూ వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అనంతపురం అసెంబ్లీ నియోజవర్గంలో గెలిచిన వాళ్ళందరూ కూడా నాన్ లోకల్ అని, అందులో ఇద్దరే ఇద్దరు ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ మాత్రమే లోకల్ అని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత.. నీ చుట్టూ ఉన్న వ్యక్తులు ఏ ఒక్కరూ లోకల్ కాదని, ఎక్కడ నుండో వచ్చి ఇక్కడ ఉన్నవారిని శాసించే అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. అప్ప.. అప్ప.. అంటూ నీ పక్కన ఉన్న కదిరి నుండి వచ్చిన చింతా సోము రెండు సార్లు నగర అధ్యక్షులుగా ఎన్నికయ్యాడు.. అతనికి ఏమి అర్హత ఉందని ఈ పదవి కట్టబెట్టారని ప్రశ్నించారు.

రాయచోటికి చెందిన రాజాసాబ్ రమేష్ గౌడ్.. నీకు ఏం అర్హత ఉందని ఇక్కడ ఉద్యోగాలు, కాంట్రాక్ట్ ఉద్యో గాలు ఇప్పిస్తూ వారి నుండి కమిషన్లు తీసుకోమని నీకు ఎవరు చెప్పారు.. నార్ప లకు చెందిన సత్యనారాయణ రెడ్డి నాన్ లోకల్ కాదా.. దామోదర్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి వీళ్లంతా కూడా ఎవరో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే అనంతకు సవాల్ విసిరారు. ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ రాజకీయాలు చేస్తారా.. మీరా మా ఎమ్మెల్యే దగ్గుబాటి గురించి మాట్లాడేది.. ఎమ్మెల్యే దగ్గుబాటిపై మాట్లాడే అర్హత మీకు ఏమి ఉందని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యేకి హంద్రీ నీవా, కృష్ణా జలాలు అంటే ఏంటో కూడా అర్థం తెలియదని పేర్కొన్నారు. హంద్రీనీవాకు 2,300 క్యూసెక్కుల నీరు కాదు వచ్చేది.. 3800 క్యూసె క్కుల నీరు వస్తాయనే విషయాన్ని తెలుసు కోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే అనంతకు దాదాపు 400 ఎకరాల భూమి అక్రమంగా సంపాదించి కూడబెట్టుకున్నారని ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ తెలిపారన్నారు. రూలింగ్ ప్రభుత్వంలో ఉండి కూడా మేము న్యాయంగా వెళుతున్నా.. వైసి పి నేతలే మమ్మల్ని రెచ్చగొట్టే విధంగా చేస్తున్నా రన్నారు. అప్పట్లో దివాకర్ రెడ్డి పుణ్య మా అని ఎంపీగా గెలుపొం దావని, మాజీ ఎమ్మెల్యే అనం త తనకు సుదీర్ఘమైన రాజ కయ అనుభవం ఉందని గొప్పలు చెప్పు కోవడం నీకే చెల్లు తుందన్నారు. మాజీ ఎమ్మె ల్యే అనంతకు ఎంపీ పెన్షన్, ఎమ్మెల్యే పెన్షన్ వసు ్తంది కదా అది చాలదా.. కూటమి ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛన్ ఇస్తే కూడా తీసుకునే విధంగా మాజీ ఎమ్మెల్యే తయార య్యారన్నారు. అప్పట్లో అనంత వెంకట రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తే.. తనకు ఇవ్వకుంటే పురుగుల ముందు తాగి చస్తానంటూ తండ్రిని బెదిరింపులకు గురిచేసి ఎంపీ టికెట్ దక్కించుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. కౌన్సిల్ సమావేశాల్లో సమస్యల పైన ప్రశ్నించమంటే వైసీపీ కార్పొరేటర్లు ప్రజాపాలన పక్కదారి పట్టించేందుకు కూటమి ప్రభుత్వంలో ఉదయమే వైన్ షాపులు తెరిచి మద్యాన్ని అమ్మకాలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని కౌన్సిల్ సమావేశంలో మాట్లాడు తారు. మా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ పరిశ్రమలు నెలకొల్పి ప్రత్య క్షంగా, పరోక్షంగా దాదాపు 2000 మందికి ఉపాధి అవకాశాలు కల్పించా రన్నారు. అలాంటి వ్యక్తిపై ఇలా దుష్ప్రచారాలు చేయడం తగదని పేర్కొ న్నారు. ఎమ్మెల్యే దగ్గుబాటి దాదాపు 50 వేల రూపాయల వరకు తన సొంత డబ్బు ప్రతిరోజు ఖర్చు చేస్తుంటాడని తెలియజేశారు. ఇలాంటి వ్యక్తిని పట్టుకుని అవినీతి ఆరోపణలు వేయడం తగదన్నారు. బియ్యంలో వాటా ఉందం టారు.. చికెన్ అమ్మకాలలో వాటా ఇవ్వాలని అంటారు. అన్ని వ్యాపారాలు వైసీపీ నాయకులు, రెడ్లే కదా చేసేది.. మరి వారిని ధైర్యంగా ముందుకు వచ్చి తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జోగి రాజేంద్ర, ఓంకార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు నలబోలు మధు రాయల్

అదుపుతప్పి ఆర్టీసి బస్సు బోల్తా

- విద్యార్థులకు తప్పిన పెనుప్రమాదం - ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆరా

పుట్లూరు, నవంబర్ 5 ప్రభాతవార్త

పుట్లూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆర్టీసి బస్సు బుధవారం చింతకుంట గ్రామ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన వున్న గోతిలో పడింది. దీంతో పిల్లలు ఒక్కసారిగా భయంతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. చింతకుంట, కందికాపుల, కడవకల్లు, చెర్లోపల్లి, మడ్డిపల్లి, సూరేపల్లి గ్రామాలకు చెందిన దాదాపు 95 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆర్టీసి బస్సుకు స్టీరింగ్ కట్ కావడంతో బస్సు అదుపుతప్పి గోతిలో పడిపోయింది. విద్యార్థులకు ఎటువంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయట పడడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదఘటనపై ఎమ్మెల్యే ఆరా : విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆర్టీసి బస్సు అదుపు తప్పిన ప్రమాద ఘటన విషయం తెలుసుకొన్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావ ణిశ్రీ ఆరా తీశారు. అధి కారులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యా ర్థులను సురక్షితంగా వారి ఇళ్లకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఆర్టీసి బస్సు రోడ్డుపక్కకు ఒరిగిపోయిన దృశ్యం

13న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలు

- డిఎస్ డిఓ మంజుళ వెల్లడి

అనంతపురం సిటీ, నవంబర్ 5 ప్రభాతవార్త

జిల్లా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడా ఎంపికలలో 13న నిర్వహించనున్నట్లు డిఎస్‌డిఓ మంజుళ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జరగనున్న సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల పోటీలకు జిల్లా జట్టుల ఎంపికను నిర్వహించడం జరుగుతుందన్నారు. పిటిసి గ్రౌండ్‌లో అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ కోకో, క్రికెట్ సెలక్షన్లను నిర్వహించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫుట్‌బాల్, హాకీ, లాంగ్ టెన్నిస్, ప్రసన్నాయనపల్లి స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్ జట్లకు ఎంపిక జరుగుతుందన్నారు. అదే విధంగా డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, వ్రెస్టింగ్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, యోగా పోటీలను నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.